కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

# చవుక

**ఎం**తో మంచివాడనుకున్న వరదయ్యల్లా చెడ్డవాడనిపించుకోవటానికి నాల్రోజులు పట్టలేదు. సమయం, సందర్భం వచ్చినప్పుడు పొగడ్తలతో ముంచెత్తినవాళ్లే నిరసనలతో ధ్వజమెత్తారు. ఇంతకీ వరదయ్య చేసిన అంత పెద్ద తప్పిదం ఏంటంటే, క్రమం తప్పకుండా పిల్లల్ని కాన్వెంట్‌కి తీసుకెళ్లేవాడల్లా చెప్పాపెట్టకుండా ఎగగొట్టటమే.



క్రమం తప్పకుండా పిల్లల్ని కాన్వెంట్‌కి పంపటమంటే ఎవరికైనా మాటలతో అయ్యే పని కాదు. ఆటోవాళ్లు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించేవాళ్లు. ఆటో

హారన్ వినిపించేదాకా అందరికీ ఒకటే టెన్షన్. ఏ రోజు వస్తాడో, ఏరోజు రాడో తెలిసేది కాదు. ఏదో వంకతో వారంలో కనీసం ఒక రోజన్నా ఎగ్గొట్టేవాళ్లు. అలాంటిది మా అపార్ట్‌మెంట్ వాళ్లం వరదయ్యను కుదుర్చుకున్నాక పిల్లల విషయంలో నిశ్చింతగా వుంటున్నామనే చెప్పాలి.

వరదయ్య అంతగా నచ్చటానికి చాల కారణాలున్నాయి. పిల్లల్ని ఆటోలో తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొచ్చేదాకా కంటికి రెప్పలా కాచుకునేవాడు. ఎదురొచ్చి పిల్లల బ్యాగులు అందుకోవటం, ఆటోలో సర్దటం, భద్రంగా అప్పగించటం ఎంతో పద్ధతిగా వుండేవాడు.

పేరుపేరునా పిల్లల్ని ముద్దుగా పలకరించటం, డల్‌గా కనిపించే పిల్లల్ని చంకనేసుకుని హుషారు చెయ్యటం, ముచ్చట్లాడుతూ పిల్లల్లో పిల్లాడిగా కలిసిపోవటం అతని ప్రత్యేకత.

అడ్వాన్సులంటూ పీడించడు. నెలవారీ బాడుగ ఇచ్చినప్పుడు తీసుకోవటమేగాని నోరు తెరిచి అడగడు. బజారులో అత్యవసర వస్తువులేమైనా కావాల్సొస్తే సాయంత్రం కాన్వెంట్ నుంచి వస్తూ తెమ్మనో, ఈ - సేవా కేంద్రంలో కరెంటు బిల్లులు కట్టమనో , చిల్లర మల్లర పనులు అప్పగిస్తే సంతోషంగా చేస్తుంటాడు. పిల్లలకైతే 'ఆటో అంకుల్'గా తెగ ఇష్టుడై పొయ్యాడు.

వరదయ్య నాగాపెట్టిన నాల్రోజులు, పిల్లల్ని కాన్వెంట్‌కు చేరవేసుకోవటానికి ఇక్కట్లు పడ్డవాళ్లంతా రకరకాల తిట్లూ, శాపనార్థాలూ పెట్టారు. అందులో నా భార్య సువర్ణ కూడా లేకపోలేదు. అదేదో పెద్ద జీవితసమస్య అన్నట్లు నలుగురాడవాళ్లు సుదీర్ఘచర్చలు, ఆలోచనలతో సతమతమై పోతున్నారు.

"అతనూ మనలాంటి మనిషే! పాపం! ఏ ఇబ్బందొచ్చిందో ఏంటో! నాల్రోజులు రాలేకపోయినంత మాత్రాన నానా యాగీ చేస్తారేం?" అంటూ ఒక చురక కూడా వేశాను.

ఇంకా రెచ్చిపోయింది సువర్ణ. " అంత ఇబ్బంది వున్నవాడు ఏ కాకి తోనో కబురెట్టొచ్చు గదా! ముందుగా చెప్తే మన ఏర్పాట్లేవో మనం చేసుకునే వాళ్లం" అంటూ నిందాపూర్వకంగానే మాట్లాడింది.

"కబురు తెచ్చేందుకు చేతికింద ఒక మనిషంటూ వుండాలి గదా! ఏం పీకల మీద కొచ్చిందో, ఏం తెలుసు?"

నేను వరదయ్యను వెనకేసుకొస్తున్నట్లుగా మాట్లాడటం సువర్ణకు అంతగా నచ్చినట్లు లేదు.

"కాన్వెంటుకు పిల్లల్ని వేళకు పంపే మారాజులు మీరుండగా ఆ గోలంతా నాకెందుకులెండి" అంటూ రాగాలు తీస్తూ చివాలున వెళ్లిపోయింది.

మరునాడు ఉదయం వరదయ్య కాన్వెంట్ టైంకు సరిగ్గా రానే వచ్చాడు. పిల్లల ముఖాలైతే ఆనందంతో విప్పారాయి గాని ఆడవాళ్ల ముఖాలు మాత్రం నిరసనతో ముడుచుకున్నాయి.

"చెప్పాపెట్టకుండా మానేస్తే ఎలా వరదయ్యా? పిల్లలు పూటమానితే కాన్వెంట్‌లో పూరుకోరని తెలుసు గదా?" ఒకావిడ కస్సుమంది.

"నా కూతురికి ప్రాణాలమీది కొచ్చిందండీ! ఆసుపత్రి చుట్టూ తిరగడమే సరిపోయింది". క్లుప్తంగా సమాధానం చెప్పాడు వరదయ్య. అప్పుడు అంత కన్నా వివరాలు చెప్పే సమయం అతనికీ లేదు, వినే ఓపిక అక్కడున్న వాళ్లకూ లేదు మరి. నిమిషాల్లో పిల్లలు ఆటోలో సర్దుకుకూర్చున్నారు. ఆటో బయల్దేరింది. అందరి ముఖాల్లో గొప్ప రిలీఫ్.... ఈ రోజుకి బ్రతికాంరా దేవుడా అనుకున్నట్లున్నారు.

సాయంత్రం పిల్లల్ని తీసుకొచ్చి దింపాక వరదయ్య కూతురి ప్రాణాపాయం గురించిన వివరాలు నాలుగిళ్లవాళ్లు రాబట్టారు. సువర్ణ నింపాదిగా విషయం కాస్తా నా చెవినేసింది.

ఇంటిదగ్గర ఆడుతూ, పాడుతూ కేరింతలు కొడ్తున్న పిల్ల ఒక్కపెట్టున కుప్పకూలిపోయిందట. పిల్ల శరీరం నీలం రంగులోకి తిరిగిపోయిందట. ఆఘమేఘాల మీద జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారట. స్టాకులేదని మందులు రాసిస్తే పరుగులు మీద కొని తెచ్చారంట.... ఐదారు వేల రూపాయలు ఖర్చుచేస్తే గాని పిల్ల ప్రాణం కుదుటపడలేదట.

మొత్తానికి అదేదో గుండె సంబంధమైన జబ్బని చివరకు తేల్చిచెప్పారట. ఒకసారి హైద్రాబాద్ తీసుకెళ్లి చూపించమన్నారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా జాగ్రత్తపడకపోతే అసలు ప్రాణాలకే ముప్పు రావచ్చని హెచ్చరించారట.

"పాపం! ఇక వరదయ్య కష్టాల్లో పడ్డట్టేనన్నమాట" నిట్టూర్చాను.

"బాగుంది. పిల్లలన్నాక జబ్బులు రావా! హాస్పిటల్‌కు తీసుకెళ్లినయం చేయించుకోమా?" అదేమంత పెద్ద సమస్యే కాదన్నట్లు మాట్లాడింది సువర్ణ.

"చిన్నా చితకా రోగాల్లాంటిదనుకున్నావేం గుండెజబ్బంటే.... లక్షలవుతుంది. వరదయ్యలాంటి పేదవాళ్లు భరించొద్దూ?" అన్నాను సానుభూతిగా.

"వాళ్లకేమండీ! తెల్లకార్డుంటే చాలు. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగానే వైద్యం చేస్తార్లెండి. అటూ ఇటూ గాకుండా అప్పులపాలై చచ్చేది మనబోటి మిడిల్‌క్లాస్ వాళ్లమే" అంటూ ఒక క్లాసు పీకింది ఆవులిస్తూ.

* * *

"వరదయ్య తలా ఓ ఐదొందలు అడ్వాన్స్‌గా ఇమ్మంటున్నాడు. పిల్లని హైద్రాబాద్ తీసుకెళ్లి చూపించుకొస్తాడట" వారం తర్వాత ఒక రోజు చెప్పింది సువర్ణ.

"ఇబ్బందుల్లో వున్నాడు. ఆపాటి సాయం చెయ్యకపోతే ఎలాగు? నెలనెలా ఇచ్చేదాంట్లో కాస్త తగ్గించుకోవచ్చు" సానుకూలంగానే స్పందించాను.

"ముందలానే చెప్తారు. తీరా తిరిగి ఇవ్వాల్సివచ్చేసరికి చెప్పాపెట్టకుండా ఉడాయించేస్తారు. పదో, పరకోనా పోనిలెమ్మను కోవటానికి. మావల్లకాదని చెప్పేస్తే ఒక్కమాటలో పోతుంది". వరదయ్యకు అడ్వాన్స్ ఇవ్వాలన్న ఉద్దేశం తనకే కాదు, మిగతా వాళ్లకూ లేనట్టు చెప్పింది.

అతని అవసరాన్ని బట్టి మరోసారి ఆలోచించి చూడమన్నాను. నలుగురూ తర్జనభర్జనలు పడ్డాక వరదయ్యకు అడ్వాన్స్‌గా తలో ఐదొందలు ఇవ్వటానికే నిశ్చయించుకున్నారు. షరతేమంటే; పిల్లల పరీక్షలయ్యేలోగా వరదయ్య అడ్వాన్సుగా తీసుకున్న డబ్బు అణాపైసల్తో సహా చెల్లువెయ్యాలి. అతను సంతోషంగా ఒప్పుకున్నాడు.

* * *

పిల్లల ఇబ్బందిని దృష్టిలో వుంచుకుని వరదయ్య ఒక పబ్లిక్ హాలిడే కలిసొచ్చేలా కూతుర్ని తీసుకుని హైద్రాబాద్ వెళ్లాడు. తిరిగి రావటం రెండ్రోజులు ఆలస్యం గావటంతో కారాలు మిరియాలు నూరారు.

"రెండ్రోజులు పరీక్షలు మీద పరీక్షలు చేశారండీ! చివరకు గుండెకు ఆపరేషన్ చెయ్యాలని తేల్చారు. అంతదాకా తగు జాగ్రత్తలో వుండకపోతే పిల్ల ప్రాణానికే ప్రమాద మన్నారు. మందులేవో ఇచ్చారు" చెప్పాడు వరదయ్య వివరంగా.

"అయ్యో! మరి ఆపరేషన్ ఎప్పుడు చేస్తారట?" సువర్ణ అడిగింది.

"అదే చెప్పలేమన్నారండీ! రాష్ట్రంలో ఈ రకంగా గుండె జబ్బులున్న పిల్లలు వేలమందున్నారంట. ఒక్కసారిగా అందరికీ ఆపరేషన్ చెయ్యాలంటే కుదిరేపని గాదు, వీలు వెంబడి వరసాగ్గా చేస్తారంటండి. మన పిల్ల వంతు ఎప్పుడొస్తే అప్పుడు వెళ్లాలట" అతని మాటల్లో నిరాశ ధ్వనించింది.

"వంతు కోసం ఎదురుచూడటం ఏంటయ్యా! ఈలోగా బిడ్డ ప్రాణాలకేవన్నా ఆపద ముంచుకొస్తే దిక్కేంటి?" అడిగాను.

"మీరన్నట్టే వాళ్లనడిగానండీ! గుండె ఆపరేషనంటే చేతుల్తో, కత్తుల్తో అయ్యే పని అనుకున్నావేంటయ్యా! మెటీరియల్ కొంటానికి వేలకు వేలు కావాలి. ఇప్పటికే గవర్నమెంట్ నుంచి రావాల్సిన బకాయి కోట్లలో వుంది. వాళ్లిచ్చే దాన్ని బట్టే మేం చేస్తుంటాం. నీకంత

కంగారుగా వుంటే వెళ్లి ప్రైవేట్‌గా ఎక్కడన్నా ఆపరేషన్ చేయించుకోమంటూ చేతులెత్తేశారండి" చెప్పాడు వరదయ్య.

నిజంగా గుండె ఆపరేషనంటే లక్షలతో అయ్యే పని. వరదయ్య లాంటి అతి సామాన్యుడు అంత ఖర్చెలా భరాయించగలడు? సరాసరి రోజుకో వందరూపాయలు సంపాదించేవాడు అంత డబ్బెలా సమకూర్చుకోగలడు? సలహా ఇవ్వటానికి మాత్రం ఏముంటుంది?

* * *

నెలరోజులు సజావుగానే గడిచాయి. వరదయ్య క్రమం తప్పకుండా పద్ధతి ప్రకారం వస్తూనే వున్నాడు. పిల్లల్ని సజావుగా కాన్వెంట్‌కు తీసుకెళ్తూనే వున్నాడు. అతని కూతురి గుండె జబ్బు గురించి దాదాపు అంతా మర్చిపోయినట్లున్నారు.

ఒకరోజు హఠాత్తుగా వరదయ్య నన్ను వెతుక్కుంటూ ఆఫీసుకొచ్చాడు. అతని ముఖంలో కంగారు చూస్తుంటేనే నాకర్థమైంది ఏదో ఆపదలో చిక్కుకున్నాడని.

"సార్! అమ్మాయికి మళ్లీ జబ్బు తిరగబెట్టింది. ప్రాణాలమీదికొస్తే ఆసుపత్రిలో చేర్పించాం. నాలుగువేలుంటే సర్దండి. మీ బాకీ వడ్డీతో సహా తీర్చుకుంటా" వరదయ్య చేతులు జోడించాడు.

నేను రెండో మాట మాట్లాడలేదు. ఏ.టి.ఎం.లో డబ్బు డ్రా చేసి ఇచ్చాను. క్షణాల్లో అక్కణ్ణుంచి మాయమయ్యాడు.

నేను ఊహించినట్లుగానే మరునాడు వరదయ్య పిల్లల్ని తీసుకెళ్లడానికి రాలేదు. అపార్ట్‌మెంట్‌లో కలకలం. నేను పిల్లల్ని దించటానికి తయారవుతూ, ఎవరి ఏర్పాట్లు వాళ్లు చేసుకుంటారన్న ఉద్దేశంతో వరదయ్య కూతురి అనారోగ్యం గురించి నలుగురికీ చెప్పేశాను.

అందరి ముఖాల్లో వరదయ్య పరిస్థితి పట్ల సానుభూతి వున్నా, తాము పడాల్సిన ఇబ్బంది గురించిన అసహనమే ఎక్కువ కనబడింది.

పిల్లల్ని కాన్వెంట్‌లో దించి వచ్చాక సువర్ణ ఆరాలు మొదలెట్టింది. నిజం చెప్పక తప్పలేదు. వరదయ్యకు నాలుగువేలు అప్పుగా ఇవ్వటం మాత్రం ఏం నచ్చలేదు.

ఎవరికైనా సహాయం చేసేటప్పుడు మన స్థోమత గురించి కూడా ఆలోచించు కోవాలని, తనకుమాలిన ధర్మం పనికిరాదని సాధించటం మొదలెట్టింది. నాలుగు మాయమాటలు చెప్తే చాలు, సులభంగా బుట్టలో పడిపోయే తెలివితక్కువ వాజమ్మగా నన్ను జమ కట్టేసింది.

వరదయ్య ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో నన్ను ఆశ్రయించాడన్న సంగతి తప్ప మరో విషయం గురించి నేనాలోచించలేదు. అతని పట్ల సాటి మనిషిగా ఆ మాత్రం స్పందించటం నా ధర్మం అనుకున్నానంతే. వరదయ్య నిజాయితీ పట్ల నాకు గట్టి నమ్మకం లేకపోలేదు.

వారం, పదిరోజులు, దాదాపు నెలపైనే గడిచింది. వరదయ్య రాలేదు. వారం రోజుల పాటు ఎదురుచూసి, తిట్లూ, శాపనార్థాలు పెడ్తూ కొత్త ఆటోవాణ్ణి కుదుర్చుకున్నారు. వరదయ్య కూతురు గురించిన ఆలోచన ఎవరికీ లేదు. అతని కూతురికి ఎలా వుందన్నదే నా ఆలోచనంతా.

వరదయ్య గుర్తొచ్చినప్పుడల్లా సువర్ణకు అతని బాకీ విషయం స్ఫురణకొచ్చి నానామాటలు అంటుండేది. ఆవిడ వేదన అర్థం చేసుకున్నవాణ్ణి గనక వాదనకు దిగకుండా ముఖం చాటుచేసేవాణ్ణి.

* * *

ఒక రోజు అనూహ్యంగా వరదయ్య అపార్ట్‌మెంట్‌కొచ్చాడు. అతని రాక పట్ల ఎవరూ స్పందించలేదు. అతను ఇవ్వాల్సిన బాకీ తాలూకు ఆశలేవో మనస్సులో చిగురించినట్లుంది, సువర్ణ పలకరింపుగా ముఖం మీద చిరునవ్వు పులుముకుంది.

తనవల్ల కలిగిన అసౌకర్యానికి అందరికీ క్షమాపణలు వేడుకున్నాడు. నిదానం మీద, అణాపైసల్తో ఎవరికివ్వాల్సిన సొమ్ము వారికి లెక్కగట్టి ఇస్తానని నమ్మకంగా చెప్పాడు. మళ్లీ యేడాదికి పిల్లల్ని తనే కాన్వెంట్‌కు తీసుకెళ్లగలననీ అభ్యర్థించాడు.

"అవన్నీ సర్లే గాని వరదయ్యా! ఇంతకీ నీ కూతురు ఎలా వుందో చెప్పావుగాదు?" అడిగాను అతని మాటలకు గండికొడ్తూ.

ఓ నిమిషం ఏం మాట్లాడలేదు. క్షణాల్లో ముఖం మీద ఒక నీలిమేఘం కమ్ముకొని కదిలిపోయినట్లనిపించింది.

"నా కూతురు చచ్చిపోయింది సార్" చెప్పాడు.

ఆ మాటలకు ఉలిక్కిపడ్డాను.

"అరెరె! ఎంత పని జరిగింది. నెలరోజులు రాకపోతే, హైద్రాబాద్ తీసుకెళ్లి పిల్లకు ఆపరేషన్ చేయించి వుంటావేమో అనుకున్నాను" నొచ్చుకుంటూ అన్నాను.

"పోనీండి! ఒక విధంగా అదట్టా చనిపోవటమే మంచిదయింది" చాలా కేజువల్‌గా వరదయ్య అనటం నాకేమాత్రం మింగుడుపడలేదు.

"అలాగంటావేం వరదయ్యా! మూడేళ్లు ముద్దుగా పెంచుకున్న పిల్ల మట్టిపాలయితే బాధేగా?" అడిగాను.

వరదయ్య కొద్దిసేపటి తర్వాత మెల్లగా గొంతు విప్పాడు.

"సార్ పిల్ల జబ్బుపడ్డ కాడ్నుంచి, అసలారోగం ఏంటో తెల్సుకునేదానికే నా తలకు మించి ఖర్చుపెట్టాను. గుండెకు ఆపరేషన్ చేస్తేగాని బతకదన్నారు. ఉచితంగా చెయ్యటానికి మావంతు ఎప్పుడొస్తదో తెలీదు. అందాకా పిల్ల ప్రాణాలు నిలుపుకోటానికి ఎంత దబ్బు ఖర్చవుద్దో తెలీదు. అప్పిచ్చేవాళ్లు ఏం జూసి నాకంత దబ్బు అప్పిస్తారు? ఒకవేళ నమ్మకం మీద ఇస్తే మాత్రం ఏం జేసి అప్పుతీర్చాల?"

నాకెందుకో అతని ధోరణి ఆశ్చర్యంగా వుంది.

"దబ్బయితే సంపాయించగలమేమోగాని పోయిన ప్రాణం తిరిగి వస్తుందా?" సీరియస్‌గానే అన్నాను.

"పోయిన ప్రాణం తిరిగి తేలేం గాని, అంతకు ధీటుగా మరో ప్రాణాన్ని పుట్టించుకోగలం కద్సార్" అన్నాడు చిరునవ్వుతో.

ఆ మాటలకు ఒక నిమిషం నేను గందరగోళపడ్డాను.

"ఇంకో ప్రాణాన్ని పుట్టించగలగటం ఏంటయ్యా?" నేనింకా అయోమయంలో పడ్డాను.

"నా బోటి పేదవాళ్ల పిల్లలకు అంత పెద్ద జబ్బులా? అట్టాంటి రోగాల నుండి బిడ్డను బ్రతికించుకోటం కోసం అప్పుల మీద అప్పులు చెయ్యాలి. ఆనక ఆ బాకీలు తీర్చటం కోసం బతికినంత కాలం నానా అగచాట్లూ, అవమానాలు పడాలి. అంతెందుకు, నాబోటి పేదవాడు ప్రాణాపాయంలో వున్న పిల్లను కాపాడుకోటానికి తలకు మించిన అప్పులు చేసి కష్టాల పాలవటం కన్నా, ఈ బిడ్డ పోతే మరో బిడ్డ పుట్టదా అనుకొని, కనటం కారుచవుక గద్సార్."

వరదయ్య తర్కం ముందు నా గొంతు పెగల్లేదు.

*(ధ్యాన మాలిక, ఆగస్టు 2007)*